క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



చెక్కు అందజేస్తున్న జీటీ సంతోష్

షాద్‌నగర్: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి మంగళవారం పట్టణానికి చెందిన వ్యాపారి జీటీ సంతోష్‌కుమార్ రూ.51 వేల చెక్కును ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, అన్నారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి



పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ స్రవంతి

షాబాద్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్లు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని కేసారం, దైవాలగూడ గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువులకు గర్భకోశ వ్యాధులు రాకుండా ఉండాలంటే గాలికుంటు టీకాలు తప్పకుండా వేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బలరామ్, బాలరాజ్, కృష్ణ, శ్రీకాంత్, రాణి, రైతులు తదితరులున్నారు.

అంబేడ్కర్ ఉత్సవ కమిటీ ఎన్నిక

కొత్తూరు: పట్టణంలో మంగళవారం అంబేడ్కర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా తిమ్మాపూరం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా అనిల్‌కుమార్, వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా రవీందర్, ప్రమోద్, కార్యదర్శులుగా సురేందర్, రంజిత్‌కుమార్, శివకుమార్, సోషల్ మీడియా ఆర్గనైజర్లుగా రాజేందర్, కల్యాణ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

సన్మానం



సీఐ కాంతరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

షాబాద్: షాబాద్ సీఐగా నూతనంగా బాధ్యతలు తీసుకున్న కాంతరెడ్డిని మంగళవారం పలువురు కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కేసారం మాజీ సర్పంచ్, షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మంగలి చెన్నయ్య, చేవెళ్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చల్లా సంతోష్‌రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలకృష్ణరెడ్డి, నాయకులు నవీన్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించారు.

శభాష్ ప్రేమ్‌కుమార్



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్: ముంబైలో ఇటీవల 6వ ఆలిండియా కుంగ్‌ఫూ, కరాటే జూడో ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్జర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నాడు. కుంగ్‌ఫూ విభాగంలో ప్రేమ్‌కుమార్ అత్యుత్తమ ప్రతిభను కనబర్చి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. పతకం సాధించిన ప్రేమ్‌కుమార్‌ను మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ బాల్‌రాజ్, విద్యార్థి తండ్రి శేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదరణ తగ్గకుండ

పేదోడి ఫ్రిజ్‌లకు భలే క్రేజ్

- వేసవిలో పెరిగిన డిమాండ్
- కుండ నీటితో ఆరోగ్యానికి మేలు



షాబాద్‌లో తయారుచేసిన కుండలు



నాగరగూడలో అమ్మకానికి సిద్ధంగా..

షాబాద్: వేసవి ఆరంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. ప్రచండుడి భగభగలకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తడారిన గొంతులను తడుపుకునేందుకు చల్లని నీటి కోసం ఎదురుచూస్తున్నారు. చల్లని నీటి కోసం కూజాలు, కుండలు మార్కెట్లో కొలువుదీరుతున్నాయి. ఆరోగ్య రీత్యా సంపన్నులు కూడా కుండనీటిని తాగేందుకు మొగ్గు చూపుతుండడంతో పేదవాడి ఫ్రిజ్‌లకు గిరాకీ పెరుగుతోంది. నగరాల్లో జీవించేవారు తమ శక్తికొలది శీతలీకరణ పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. కుండలో సహజ సిద్ధంగా చల్లబడే నీటితో దాహార్తి తీరడమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

సహజ శీతలీకరణ..

వేసవిలో దాహం తీర్చుకోవడానికి ఫ్రిజ్‌లు కొనలేని వారికి చల్లని నీటిని అందించడం కోసం కుండలు సిద్ధమవుతున్నాయి. షాబాద్ మండలంలోని నాగరగూడ, తాళ్ళపల్లి, హైతాబాద్, షాబాద్, సర్దార్‌నగర్ తదితర గ్రామాల్లో మార్కెట్‌లో కుండలు లభిస్తున్నాయి. ఒక్కో కుండ రూ.140 నుంచి 160 వరకు ధర పలుకుతోంది. కుండ నీటితో మనిషికి ఆరోగ్యాన్ని ఇస్తాయని వైద్యులు చెబుతున్నారు. మట్టి కుండలో నీరు మరింత రుచిగా ఉంటాయనే పేరుంది. పైగా తక్కువ ఖర్చుతో కరెంట్ వినియోగం లేకుండానే చల్లని నీటిని అందిస్తోంది. మనిషి ఆరోగ్యంపై ఎలాంటి దుష్ప్రభావం చూపకుండా వేసవి దాహార్తిని తీర్చే కుండలపై సంపన్నులు సైతం మక్కువ చూపుతున్నారు. మండుటెండలకు కుండల వినియోగం పెరుగుతోంది. దీంతో రోజురోజుకు కుండలకు గిరాకీ రెట్టింపవుతోంది. బాటసారులకు నీరు అందించే చలివేంద్రాల్లో సైతం పెద్దసైజులో ఉన్న కూజాలనే వినియోగిస్తారు. అందుకే రకరకాల ఫ్రిజ్‌లు వచ్చిన మట్టి కుండల స్థానం నేటికీ పదిలంగానే ఉంది.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న సురేందర్‌రెడ్డి

షాబాద్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తోందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో రూ.10లక్షలతో సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. గ్రామాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మారుమూల గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెలంగాణాలో అమలవుతున్నాయని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పామెన నర్సింహులు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవరామ్, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి, నాయకులు రవీందర్, అశోక్, చెన్నయ్య తదితరులున్నారు.

విజయసంకల్ప సభకు తరలిన నాయకులు



సభకు వెళ్తున్న నాయకులు

కొత్తూరు: హైదరాబాద్ పట్టణంలోని ఎల్‌బీ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన బూత్, శక్తికేంద్రాల విజయసంకల్ప సభకు మండలం నుంచి బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు బాబయ్య మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ తప్పకుండా అధికారంలోకి వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని కోరారు. పీఎం మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినట్లు తెలిపారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌గౌడ్, నర్సింహ్మగౌడ్, నాగరాజుచారి, రమేశ్, రణధీర్, శేఖర్, జగన్ పాల్గొన్నారు.

విరబూసిన మోదుగపూలు



షాబాద్‌లో విరబూసిన మోదుగపూలు

షాబాద్: మోదుగ చెట్లు గ్రామాల్లోని బీడు భూముల్లో, వ్యవసాయ బావుల వద్ద ఎక్కువగా కనిపిస్తుంటాయి. సాధారణంగా మిగతా చెట్లన్నీ ఆకులు కలిగి ఉండి వాటితో పాటు పువ్వులు పూస్తుంటాయి. కానీ ఈ చెట్లు వాటికి భిన్నంగా ఆకులు రాలిపోయి చెట్టంతా పూలతో నిండిపోయి కనువిందు చేస్తున్నాయి. ఫిబ్రవరి చివరి వారం నుంచి మొదలుకొని మార్చినెల చివరి వారం వరకు విరివిగా పూస్తాయి. ఇవి ప్రధాన రహదారుల వెంట ఉండడంతో చూపరులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మండల పరిధిలోని కుర్వగూడ, కక్కులూర్, కుమ్మరిగూడ, అంతారం, నరెడ్లగూడ, షాబాద్ తదితర గ్రామాల సమీపంలో ఈ చెట్లు ఉండగా ఎర్రని పూలపై తేనెటీగలు గుంపులుగా వాలి మకరందాన్ని సేవిస్తున్నాయి.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్ రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ వికారాబాద్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యార్థినులకు బాటనీ, కామర్స్ బోధన కోసం పార్ట్‌టైమ్ లెక్చరర్‌గా పని చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు ఉండాలని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్‌సెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. బీఎస్సీ నర్సింగ్ జీఎన్‌ఎం అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు హెల్త్ సూపర్‌వైజర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులకు సర్టిఫికెట్లు కాపీలను జత చేసి ఈ నెల 14వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు మొయినాబాద్ మండలంలోని తోల్‌కట్ట సమీపంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ వికారాబాద్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మిగతా వివరాల కోసం 9885504397లో సంప్రదించాలని కోరారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి

చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జిగా రాజామహేంద్రవర్మ నియామకం

చేవెళ్ల: బీఎస్పీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాజామహేంద్రవర్మ ఎంపికయ్యారు. మంగళవారం ఆయన చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ.. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రాబోయే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీలో పలువురికి ఆయా నియోజకవర్గాల వారీగా పదవులను అప్పగిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న తనకు పార్టీలో పదోన్నతిగా పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో పార్లమెంట్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకోసం పనిచేస్తున్న తనను గుర్తించి ఉన్నతమైన బాధ్యతలను అప్పగించారన్నారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషిని అందిస్తానని చెప్పారు. పార్టీ పథకాలను కార్యకర్తలు, ప్రజలకు వివరిస్తానన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అప్పగించిన బాధ్యతలను నిర్వహిస్తూ పార్టీని గెలిపించుకునేందుకు పాటుపడతానని చెప్పారు.

మున్సిపల్ అభివృద్ధికి చర్యలు

కమిషనర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

శంకర్‌పల్లి: ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి, మున్సిపల్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ సిబ్బందితో రెవెన్యూ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇంటి పన్నులను చెల్లించి అభివృద్ధికి సహకరించాలన్నారు. కాగా వ్యాపార సముదాయం యాజమాన్యం ట్రేడ్ లైసెన్సులను రినివల్ చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పన్నులు కట్టించే విధంగా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కాగా ఆదివారం, మంగళవారం, గురువారాల్లో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 11:30 గంటల వరకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి పన్నులను స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులతో ఆప్యాయంగా..



వృద్ధాశ్రమానికి వంట సామగ్రి అందజేస్తున్న విద్యార్థులు

షాద్‌నగర్: పట్టణంలోని ఠాగూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం నవోదయ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులను ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆశ్రమానికి కావాల్సిన వంట సామగ్రితో పాటుగా కొంత నగదును అందజేశారు. సేవా కార్యక్రమాలు చేపట్టడంలో భాగంగా వృద్ధాశ్రమాన్ని సందర్శించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిప్రకాశ్ హర్మాశ్, ఇందిర, మాధవిలత, గీత, నరేశ్, ఆశ్రమ నిర్వాహకులు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘శ్మశాన’ బాధలు తీర్చండి

బీఎస్పీ చేవెళ్ల నియోజకవర్గ ఉపాధ్యక్షుడు వెంకటేశ్



వినతిపత్రం అందజేస్తున్న వెంకటేశ్, గ్రామస్తులు

షాబాద్: దళితులను శ్మశానానికి రానివ్వకుండా అడ్డుకోవడం సరికాదని బీఎస్పీ చేవెళ్ల నియోజకవర్గ ఉపాధ్యక్షుడు వెంకటేశ్ పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మధుకు లింగారెడ్డిగూడ గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగారెడ్డిగూడ గ్రామానికి చెందిన దళితులు శ్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గ్రామస్తులతో ఎంతో మొరపెట్టుకున్న ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. గతంలో లింగారెడ్డిగూడ సర్వేనంబర్ 456లో దళితులకు 1.20 గుంటల భూమిని చూపించారు. ప్రస్తుతం అక్కడికి శవాన్ని తీసుకొని వెళ్తే కొంత మంది అడ్డుకున్నారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని పోలీసులకు, డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ మధు మాట్లాడుతూ.. గ్రామానికి వచ్చి విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులున్నారు.

ఆకట్టుకున్న మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో గెలుపొందిన అభ్యర్థికి నియామకపత్రం అందజేస్తున్న హెచ్‌ఎం లక్ష్మణ్



గెలుపొందిన అభ్యర్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సాధారణ ఎన్నికలను తలపించిన నిర్వహణ

- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

షాబాద్: మండలంలోని సర్దార్‌నగర్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులు మాక్ పోలింగ్(నమూనా ఎలక్షన్)ను విజయవంతంగా నిర్వహించారు. ఐదు నుంచి పదోతరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఎన్నికలో పోటీదారులుగా.. ఓటర్లుగా.. ఎన్నికల సిబ్బందిగా.. పోలీసులుగా విధులు నిర్వహించి అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం లక్ష్మణ్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ఓటు హక్కుపై అవగాహన అవసరమన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రయోగాత్మకంగా విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించామన్నారు. ఈ ఎన్నికల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. అభ్యర్థులను ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ పోలింగ్‌లో నలుగురు విద్యార్థులు అభ్యర్థులుగా పోటీ చేశారు. 9వ తరగతికి చెందిన సాయిసిరి, అర్చన, భానుప్రసాద్, ఫర్హాన్‌లు పోటీ చేశారు. విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొన్ని వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుశీల, జంగయ్య, రవీందర్‌గౌడ్ తదితరులున్నారు.

చలివేంద్రాన్ని ఏర్పాటు చేయరూ..

నందిగామ: అసలే మండుతున్న ఎండలు.. పలు గ్రామాల నుంచి మండల కేంద్రానికి రాకపోకలు కొనసాగించే ప్రజలు.. మధ్యాహ్నం అయితే చాలు దాహం వేసి తాగునీటి కోసం అల్లాడుతున్నారు. గుక్కెడు నీరు దొరక్కపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్థిక స్తోమత ఉన్నవారు నీటిని కొనుగోలు చేసి తాగుతుండగా స్తోమత లేని వారు దాహార్తితో తల్లడిల్లుతున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వారు పలు పనుల నిమిత్తం మండల కేంద్రానికి వస్తుంటారు. వీరితో పాటు పారిశ్రామిక ప్రాంతం కావడంతో నిత్యం కార్మికులతో కిటకిట లాడుతుంటుంది. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని దాతలు దయ చూపాల్సిన అవసరం ఉంది. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామిక వేత్తలు ప్రజలు దాహార్తిని దృష్టిలో పెట్టుకొని మండల కేంద్రంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

మత్స్యసహకార సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి ఓంప్రకాశ్

షాబాద్: మత్స్యకారులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సంఘం ఎన్నికల అధికారి ఓంప్రకాశ్ పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో రాష్ట్ర సహకార ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారులు ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం మత్స్య సహకార సంఘం ముద్దెంగూడ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాండు, గౌరవ అధ్యక్షుడిగా మల్లేశ్, ఉపాధ్యక్షుడిగా రవి, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలం, కోశాధికారిగా మల్లేశ్, డైరెక్టర్లుగా శ్రీశైలం, దయాకర్, రమేశ్, ప్రవీణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు లింగం, గౌరవ అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి మాసయ్య, జిల్లా కార్యదర్శి జంగయ్య, సంఘం నాయకులు నర్సింహులు, యాదగిరి, జనార్దన్, మాసయ్య, పోచయ్య, యాదయ్య, సుధాకర్, సురేష్, రాంచంద్రయ్య, జంగయ్య తదితరులున్నారు.